# గాఢమైన బంధం

కొడుకు టెన్త్ క్లాసు మార్కులు చూసిన మాధవీ, చక్రవర్తీ తేజస్వి మీద మండిపడ్డారు.

"తలెత్తుకో లేకుండా చేశావు కదరా" మాధవి తిట్టింది.

"ఈ మార్కులే నాకొస్తే నేను హుస్సేన్‌సాగర్‌లో దూకేవాణ్ణి" అన్నాడు చక్రవర్తి.

కొడుకుని తిట్టాక ఇద్దరూ ఆఫీసులకి వెళ్ళిపోయారు. ఇంట్లో కూచుని ఆలోచించిన తేజస్వికి తండ్రి సూచించిందే ఉత్తమ మార్గంలా తోచింది. తనలా తల్లిదండ్రులకి చిత్తక్షోభ కలిగించిన వాడు చచ్చిపోతేనే మంచిది. ఏమిటి మార్గం. విషం కొనుక్కుందుకూ, హుస్సేన్‌సాగర్ దగ్గరకు వెళ్ళడానికీ తన దగ్గర డబ్బుల్లేవే.

కరెంటు షాకు అతనికి సరైన మార్గంలా కనిపించింది. ఇంట్లో తనూ, తాతయ్యా తప్ప ఎవరూ లేరు. తాతయ్య పడుకున్నాక పని కానిస్తే సరి.

తాతయ్య గది వైపుకి నాలుగుసార్లు వెళ్ళిచూశాడు. ఆయనింకా పడుకున్నట్లు లేదు. ప్రతిసారీ పలకరిస్తూనే ఉన్నాడు.

ఒంటిగంటకి చూసినప్పుడు గురక విన్పించింది. వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్ళి బాత్రూంలో తలుపేసుకున్నాడు. నీళ్ళు కాచుకునే హీటర్ చేత్తో పట్టుకుని గుండె దగ్గర పెట్టుకున్నాడు.

'నాన్నా మీ కోరిక తీరుస్తున్నా' అనుకున్నాడు. రెండో చేత్తో స్విచ్ వేశాడు.

ఆశ్చర్యం! చావలేదు. కరెంటు కానీ పోయిందా.

"తేజస్వీ, బయటకురా" అన్న తాతయ్య కేకతో బయటకు వచ్చాడు.

రాజగోపాలంగారు నవ్వుతూ, "చిన్న కథ చెప్తాను. విన్నాక నీ ఆత్మహత్యా ప్రయత్నం చేసుకో" అన్నాడు.

"తాతయ్యా! నిద్రపోతున్నావనుకున్నాను. నీకెలా తెలిసింది?"

"ఏమీ తెలియకుండానే ఇన్నేళ్ళు వచ్చాయనుకుంటావా? ప్రొద్దుట మీ అమ్మా, నాన్నా తిట్టేక నీ మనస్సెలా పని చేస్తుందో తెలియదనుకున్నావా? నా గది చుట్టూ నువ్వు నాలుగైదు సార్లు ఎందుకు తిరిగావో అర్థం చేసుకోలేననుకున్నావా?"

"కానీ తాతయ్యా....."

'నాకు ఏమీ చెప్పద్దు. నేను నీకు అడ్డురాను కథ అయిపోయాక మెయిన్ స్విచ్చి నేనే మళ్లీ వేస్తాను.'

తాతయ్య స్విచ్చి ఆపేశాడా అనుకున్నాడు తేజస్వి.

రాజగోపాలంగారు కథ ప్రారంభించారు.

"పల్లెటూళ్లో మాధవస్వామిగారు పౌరోహిత్యం చేసుకుంటూ ఉండేవారు. ఆయనకు ఒక్కడే కొడుకు. నా పేరే పెట్టుకుందాం. రాజగోపాల్. ఆ మాధవస్వామిగారికి ఇంగ్లీషు రాదు. కొడుకుని పట్నంలో ఉంచి చదివించేవారు. సెలవులలో రాజగోపాల్ మార్కుల కాగితం ఇంటికి వచ్చింది. రాజగోపాల్ తనకి అన్ని సబ్జెక్టులలోనూ మంచి మార్కులు వచ్చాయనీ, తను పాసయ్యాననీ చెప్పాడు. ఆ మాటలు నమ్మిన మాధవస్వామిగారు సాయంత్రం కరణం గారింటికి వెళ్లి తన కొడుకు మంచి మార్కులతో పాసయ్యాడని చెప్పి ఉత్తరం చూపించారు.

ఉత్తరం చూసిన కరణం గారు దిగ్భ్రాంతులయ్యారు. రాజగోపాల్ ఏ సబ్జెక్టులోనూ పాసు కాలేదు. ఆ సంగతే చెప్పలేక చెప్పారు మాధవ స్వామితో. విషయం తెలిసిన మాధవస్వామి ఉగ్రుడయ్యాడు. ఇంటికి వచ్చి కొడుకుని పలుపుతాడుతో బాదేశారు.

'నాన్నా! నీకు కోపం వస్తుందని అబద్ధం చెప్పాను.' అంటూ ఏడిచాడు రాజగోపాల్. 'అబద్ధం చెప్తేనే ఎక్కువ కోపం వస్తుందిరా! అంటూ మరింతగా పలుపు తాడుతో కొట్టారు. దెబ్బలు తట్టుకోలేని రాజగోపాల్ చుట్టాలింటికి పారిపోయాడు. కోపం తగ్గని మాధవస్వామిగారు 'నా కొడుకు చచ్చాడనుకుంటాను' అంటూ శ్రాద్ధం పెట్టేశారు.

"బాధతో కొడుకు నిజంగా చచ్చిపోయాడా?" అని అడిగాడు తేజస్వి.

"కాలం అన్ని గాయాలనూ మాపుతుంది. అన్ని కోపాగ్నులనీ చల్లారుస్తుంది. కొన్నాళ్లకి కొడుకు మీద మాధవస్వామిగారికి కోపం తగ్గింది. బాగా చదువుకోవాలన్న కోరిక రాజగోపాల్‌కీ వచ్చింది. తండ్రీ కొడుకులు ఒక్కటయ్యారు. రాజగోపాల్ బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేశాడు."

"ఈ కథ నిజమా తాతయ్యా?"

"ఈ కథ నిజమని నేను ఘంటాపథంగా చెప్పగలను. ఎందుకంటే ఆ రాజగోపాల్‌ను నేనే కాబట్టి."

తేజస్వి ఆశ్చర్యంగా చూశాడు.

'పిల్లలు బాగా చదువుకోవాలన్న మంచి ఉద్దేశ్యం తోటే తల్లిదండ్రులు తిడతారు. ఒక్కగానొక్క కొడుకుని చచ్చిపోవాలని వాళ్లకి ఉంటుందా? అయితే తల్లిదండ్రులు ఇష్టం వచ్చినట్లు తిట్టడం రైటని నేను చెప్పను. సాయంత్రం వచ్చాక వాళ్లనీ కూర్చోపెట్టి మృదువుగా మాట్లాడాలని చెప్తానులే. కొట్టినా, తిట్టినా, చివరకు శ్రాద్ధం పెట్టినా తల్లిదండ్రులు పిల్లలను ప్రేమిస్తూనే ఉంటారు. అప్పడప్పుడు కోపానిది పైచెయ్యి అయినా అనుబంధం మాత్రం గాఢమైనది. తెలిసిందా?"

తేజస్వి అర్థమైనట్లుగా తల ఊపాడు.

"అయితే మంచిదే. నువ్వే మెయిన్ స్విచ్చివేసెయ్యి."

పరిగెడుతున్న తేజస్విని చూసి తృప్తిగా నిట్టూర్చారు రాజగోపాలంగారు.

(ఆంధ్రప్రభ వీక్లీ)